క్లుప్తంగా

పరిష్కార వేదికలో మూడు అర్జీలు



రేపల్లె: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక చక్కని మార్గమని ఆర్డీవో నేలపు రామలక్ష్మి అన్నారు. స్థానిక రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించి మాట్లాడారు. భూమి ఆన్‌లైన్ సమస్యపై ఒక అర్జీ, భూమి సర్వే చేసి హద్దులు చూపించాలని మరో అర్జీ అందిందన్నారు. అదే విధంగా స్థిర నివాస ధృవీకరణ పత్రానికి మరో అర్జీ అందిందని తెలిపారు. సమస్యలను ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

శ్రీ అంకమ్మ తల్లికి శ్రావణమాస సారె



కోనేటిపురం(భట్టిప్రోలు): గ్రామ దేవతలను పూజించడంతో పాడి పంటలు సంవృద్ధిగా పండి ప్రజలందరూ సకల శుభాలతో ఉంటారని గ్రామస్తులు తెలిపారు. సోమవారం భట్టిప్రోలు మండలం కోనేటిపురం గ్రామానికి చెందిన పడమటివారి ఇలవేల్పు అంకమ్మ తల్లికి మేళ తాళాలు, భాజా భజంత్రీలతో ఊరేగింపు, నగర సంకీర్తన నిర్వహించి సారె సమర్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు. గ్రామ దేవత శ్రీ గోగులమ్మ అమ్మ వార్లకు గౌడ సంఘీయులు శ్రావణమాస సారె సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



అమర్తలూరు(వేమూరు): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలు చేయాలని గ్రామ సర్పంచి మండే నాగేశ్వర రావు తెలిపారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎన్నికల తర్వాత మరిచిపోయిందని ఆరోపించారు. ఖరీఫ్ సీజనలో కౌలు రైతులకు పెట్టుబడులు లేక ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వం ఖరీఫ్ సీజనలో పెట్టుబడి కింద కౌలు రైతులకు రైతు భరోసా అందించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు తమలపాడుకు ప్రేమయ్య, మానకొండ నాయుడమ్మ, మానుకొండ శాస్త్రీ, సరీస్ బాబు, మేశక్, మండే శ్యామ్ కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల నిర్ణయంతోనే ప్రైవేటు ఏజెన్సీకి

తెనాలి రూరల్: తెనాలి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఆవరణలోని కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడం ఉన్నతాధికారుల నిర్ణయమేనని తెనాలి బీఎస్ఎన్ఎల్ ఆపరేషన్స్ డీఈ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రైవేటు ఏజెన్సీకి ఇవ్వడాన్ని నిరసిస్తూ మహిళా ఉద్యోగి నిరసన దీక్ష చేపట్టిన నేపథ్యంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఔట్‌సోర్సింగ్ కస్టమర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని రెండు రోజుల క్రితం ఆదేశాలు రావడంతో సోమవారం ఏర్పాటు చేశామని.. ఇవన్నీ ఉన్నతాధికారుల నిర్ణయంలో ఓపెన్ టెండర్ ద్వారా ఏజెన్సీని ఎంపిక చేశారని ఆయన వివరించారు.

విశ్వబ్రాహ్మణ అపరకర్మశాల ప్రారంభం



తెనాలి టౌన్: స్థానిక రామలింగేశ్వరపేట గురవయ్య కాలనీలో సోమవారం పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ అపరకర్మశాల ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ వజ్రాల శివకుమార్ పాల్గొన్నారు. సంఘ అధ్యక్షుడు జి.అర్జున్, ప్రధాన కార్యదర్శి శేషుబాబు, కోశాధికారి లక్ష్మీప్రసాద్, సంఘ పెద్దలు కె.వెంకటేశ్వరరావు, పి.మణికుమార్, ఎం.సుబ్రహ్మణ్యం, హరిదాసు గౌరిశంకర్, గల్లా సతీష్, ఎం.శరత్, ఉదయ్‌శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త అశోక్‌బాబు



కోనేటిపురంలో స్థానికులతో మాట్లాడుతున్న అశోక్‌బాబు

కోనేటిపురం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురానికి చెందిన పలువురు తమ పింఛను తొలగించారని వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్ బాబుకు గోడు వెళ్లబుచ్చారు. కోనేటిపురం గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. లబ్ధిదారులు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛను అందించేలా చూస్తానని ఆయన భరోసా కల్పించారు. పింఛను తిరిగి వచ్చేంత వరకూ పోరాడి సాధిస్తానని లబ్ధిదారులతో ఆయన అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశానుసారం కార్యక్రమం కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ.. కూటమి ఏడాది పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయని బాబును ప్రశ్నించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆళ్లమూడిలో..

మండలంలోని ఆళ్లమూడిలో నిర్వహించిన కార్యక్రమంలో అశోక్‌బాబు పాల్గొన్నారు. బూటకపు హామీలతో ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని ఆయన అన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పల్లెకోన గ్రామ పంచాయతీ పరిధిలో అశోక్‌బాబు ఆదేశాల మేరకు సోమవారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి బొల్లెద్దు రాజమ్మ, ప్రతాప్ కుమార్, చిలకా రత్నబాబు, పార్టీ అధ్యక్షులు పులివర్తి సుధాకర్, రాష్ట్ర దివ్యాంగుల జనరల్ కార్యదర్శి బడుగు శ్రీనివాసరావు, నాయకులు నూతక్కి జశ్వంత్ రాజ కొమ్ము వినోద్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామరామర్శ..

పెదపులివర్రులో పులివర్తి కమలమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులను అశోక్‌బాబు పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి జల్లి జోషికాంత్, గ్రామ పార్టీ అధ్యక్షులు వరకుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో డెంగీ ప్రభావంతో మలేరియా, వైద్య, ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఈ సందర్భంగా సోమవారం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వైవీ కృష్ణయ్య (రేపల్లె), వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామంలో జ్వరాలు ఏమైనా ఉన్నాయా అని ఇంటింటి సర్వే(పీడీపీ) నిర్వహిస్తున్నారు. వాడకుండా ఉన్న వస్తువులలో వర్షపు నీరు నిల్వ ఉండడాన్ని గమనించి వాటిని తొలగింప చేశారు. ఇళ్లల్లో సైఫనోత్రిన్ స్ప్రే చేయించారు. ఎబెట్ మందును కిరోసిన్‌తో కలిపి పంచాయతీ సిబ్బందితో ఫాగింగ్ చేయించారు. మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి దారా రవి కిరణ్మయి, డెప్యూటీ ఎంపీడీవో విజయబాబు, రేపల్లె డివిజనల్ అభివృద్ధి అధికారిణి పి.పద్మ, దారా చెన్నయ్య, కార్యదర్శి బి.మాక్సీ నాయక్, పీహెచ్‌సీ వైద్యురాలు మోహసీనా తాజ్, సీహెచ్‌వో బంకా మంగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకట పద్మావతి, హెల్త్ విజిటర్ రుసుముల్లా, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈనాం భూములకు పాస్‌పుస్తకాలు అందించాలి



సమస్యలను తహసీల్దార్ పద్మావతికి వివరిస్తున్న అర్చక సంఘం సభ్యులు

చెరుకుపల్లి: అర్చకులు ఎన్నో ఏళ్లుగా ఉంటున్న ఈనాం భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అడంగల్‌ను ప్రభుత్వం కేటాయించాలని నవ్యాంధ్ర అర్చక, సర్వీస్ ఈనాం దారుల సేవా సమితి అధ్యక్షుడు నారాయణం శరత్‌చంద్ర కోరారు. సోమవారం మండల పరిధిలోని గుళ్లపల్లి శ్రీ ఆనందీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2015–16లో కోర్టు ఇచ్చిన తీర్పుని దేవాదాయ ధర్మాదాయ శాఖ తప్పని సరిగా అమలు చేసి అర్చకుల గౌరవ ప్రతిష్టలు కాపాడాలని డిమాండ్ చేశారు. అర్చకులంతా తమ హక్కుల కోసం ఐకమత్యంగా పోరాడాలని అర్చకులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం అర్చకులు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యలను తహసీల్దార్ సీహెచ్ పద్మావతికి వివరించారు. కార్యక్రమంలో వేదాంతం వరదాచార్యులు, రావూరి ఆంజనేయులు, పొన్నపల్లి సత్యనారాయణ, రాంపల్లి జగన్నాథ శాస్త్రి, దిట్టకవి లక్ష్మాచార్యులు, జంజనం హేమశంకరరావు, స్వర్ణ శ్రీనివాస శర్మ, బృందావనం ఫణికుమార్, వేదాంతం బాలమురళీ కృష్ణమా చార్యులు, బయ్యన వెంకటరావు, తదితర అర్చకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు



రికార్డులను తనిఖీ చేస్తున్న ఏవో శ్రీనివాసరెడ్డి

కొల్లిపర: రైతులు ఎటువంటి అపోహలను పెట్టుకోకుండా ఏ రకమైన పంటలకైనా నానో యూరియా, డీఏపీ వాడవచ్చునని ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువుల వ్యాపారులు ఎవరైనా ఎరువులు, పురుగు మందులు కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి లైసెన్స్‌లను పూర్తిగా రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు నానో యూరియా, డీఏపీ వాడడం వల్ల గతంలో మాదిరిగానే పంటలు పెరుగుదల, దిగుబడి పెరుగుతుందని.. నేల, నీరు, వాయు కాలుష్యాన్ని తగ్గిస్తుందని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తికి వాటర్ బాటిల్స్ తరలింపు



తరలిస్తున్న వాటర్ బాటిల్స్‌తో కుమార్‌పంప్స్ ప్రతినిధులు

తెనాలి టౌన్: పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి పురస్కరించుకుని స్థానిక సుల్తానాబాద్‌లోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌నందలి కుమార్‌పంప్స్ ఆధ్వర్యంలో పుట్టపర్తికి లక్ష లీటర్ల మినరల్ వాటర్ బాటిల్స్, ఐదు టన్నుల నిమ్మకాయ పచ్చడి ఉచితంగా పంపిస్తున్నట్లు కుమార్‌పంప్స్ ఎండీ సతీమణి కొత్త వసుంధర తెలిపారు. సోమవారం స్థానిక కుమార్‌పంప్స్ కార్యాలయంలో బాటిల్స్‌ను తరలించే ప్రక్రియ చేపట్టారు. నవంబరు 16 నుంచి 23 వరకు సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు పుట్టపర్తిలో వైభవంగా జరుగనున్నట్లు చెప్పారు. రాష్ట్రం మొత్తం మీద 26 జిల్లాల నుంచి 290 మంది ప్రతినిధులు బొమిదాల కల్యాణ మండపంలో సమావేశమయ్యి సేవలందించనున్నట్లు చెప్పారు. పాడేరులోని ఆదివాసులకు రూ.10 లక్షలు విలువ చేసే ఫినోలెక్స్ పైపులు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. నవంబరు 23న సత్యసాయిబాబా పుట్టినరోజును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పండుగ రోజుగా ప్రకటించడం సంతోషనీయమని చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ కొడాలి మల్లీశ్వరి, సంపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాలేయ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఫార్మసీ విభాగాల ఆధ్వర్యంలో సోమవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు గ్రామంలో కాలేయ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుప్రియ మాట్లాడుతూ హెపటైటిస్ (కాలేయం) వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే కాలేయాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కలుషిత ఆహారం, నీరు, రక్తం, వాడిన సూదులు తిరిగి వాడడం, టాటూలు వేయించుకోవడం, టూత్ బ్రష్‌లు, బ్లేడ్‌లు తదితర వాటి ద్వారా కాలేయ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వలంటీర్లు గ్రామస్తులకు వివరించారు. కళ్లు, చర్మం పసుపు రంగులోకి మారటం, మూత్రం ముదురు రంగులో రావడం, ఆకలి తగ్గటం, అలసట, కడుపు నొప్పి, వాంతులు లక్షణాలుగా ఉంటాయని తెలిపారు. లివర్ ఫంక్షనింగ్ టెస్ట్, హెపటైటిస్ ప్యానల్, పీసీఆర్ టెస్ట్, అల్ట్రాసౌండ్ స్కాన్ తదితర పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించవచ్చని, హెపటైటిస్‌లో ఎ, బి, సి, డి రకాలు ఉంటాయని వివరించారు. ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కో ఆర్డినేటర్ సురేష్, వలంటీర్లను వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చక్రవర్తి, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు అభినందించారు.

రేపు వాహనాలకు బహిరంగ వేలం

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

బాపట్ల టౌన్: బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నేరాలలో ప్రమేయం ఉన్న వాహనాలకు ఈనెల 13న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం తమ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బహిరంగ వేలంలో హీరోహోండా సీడీ డిలాక్స్ రూ.6 వేలు, టీవీఎస్ ఎక్స్ఎల్ రూ.4,500, హీరోహోండా స్ప్లెండర్ రూ.10 వేలు, హీరో గ్లామర్ రూ.30 వేలు చొప్పున ధర నిర్ణయించామని అన్నారు. ఆసక్తి కలిగిన పాట దారులు బహిరంగ వేలంలో పాల్గొని పాట రూపంలో వాహనాలను దక్కించుకోవాలన్నారు. హెచ్చు ధర పాట దారులకే వాహనాలను అందజేయనున్నామని ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలి



కర్లపాలెం: అందరూ దేశభక్తిని అలవర్చుకోవాలని ఓబీసీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సోమవారం బీజేపీ నాయకులు హైవెండ్ హైస్కూల్ విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. ఎందరో మహానుభావులు స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి అమరులయ్యారని, వారి త్యాగాల ఫలితమే మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందని తెలిపారు. మనదేశంలో ఎన్నో జాతులు, కులాలు ఉన్నప్పటికీ అందరూ ఐకమత్యంగా కలిసి ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో మనదేశం అభివృద్ధి దిశగా పయనిస్తుందని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు పిట్టు సాంబిరెడ్డి, నాయకులు కొండారెడ్డి అనిల్‌కుమార్, బన్నారావూరి సత్యనారాయణ, కొమ్మనబోయిన మణియాదవ్, రామకృష్ణ, నారాయణ, కరిముల్లా, శ్రీనివాసరెడ్డి, సుభాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని అమలుచేయాలి

తాడేపల్లి రూరల్: విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు గత 251 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను తీరుస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉండవల్లి దళితవాడ కరకట్ట మధ్యలో ఉన్న గుంటూరు చానల్ హెడ్ స్లూయిస్ వద్ద కాలువ నీటిలో గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని తాడేపల్లి పోలీసులు సోమవారం వెలికి తీశారు. ఎస్ఐ స్వామి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఉండవల్లి దళితవాడ కరకట్ట వెంబడి పుష్కరాల నివాసాల్లో బంధువుల ఇంటికి వచ్చి సరదాగా ఈతకు గుంటూరు చానల్‌లోకి దిగిన జంపల భవానీ శంకర్ (35) నీటిలో మునిగి గల్లంతయ్యాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆది, సోమవారాల్లో గుంటూరు చానల్‌లో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా గుంటూరు కాలువ హెడ్ స్లూయిస్ సమీపంలో మునిగిపోయిన భవానీ శంకర్ మృతదేహం నీటి ఒరవడికి కొట్టుకుపోయింది. నులకపేట హెడ్ స్లూయిస్ మధ్యలో లభ్యమయిందని, పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించామని, జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి శ్రీనివాసరావు తెలిపారు.

శైవ క్షేత్రాలలో విశేష పూజలు



శ్రీ నరేంద్ర స్వామివారు



శ్రీ బాలకోటేశ్వరస్వామి

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన శ్రీనరేంద్ర స్వామివారి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రావణ మాసం పురస్కరించుకుని దేవాలయంలో వేద బ్రాహ్మణులు ఆమంచి సృజన్ కుమార్ అర్చకులు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయంలో స్వామి, అమ్మవారిని దర్శించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం గోవాడలో కొలువైన శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. దేవాలయంలో కార్యనిర్వాహణాధికారి బి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు స్వర్ణ శ్రీనివాస శర్మ, అర్చకులు చావలి శ్రీధర్ శర్మ, పొన్నపల్లి సత్యనారాయణ స్వామి వారికి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



పొలాలను పరిశీలిస్తున్న ఏవో ఫారుక్, రైతులు

చెరుకుపల్లి: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొంత మేర వరి పొలాలు ముంపునకు గురైయ్యాయని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫారుక్ అన్నారు. సోమవారం సాక్షి దినపత్రికలో 'ముంపులో పంటపొలాలు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఏవో గుళ్లపల్లి దేవుడి మాన్యం పొలాలను పరిశీలించారు. రైతులు సాధ్యమైనంత త్వరగా నీటిని బయటకు పంపాలని ఆయన రైతులకు సూచించారు. అయితే మండలంలో 9వ తేదీన 66 మిల్లీ మీటర్లు.. 10వ తేదీన 39 మిలీ మీటర్ల వర్షపాతం నమోదయిందని ఆయన అన్నారు. కాగా నీటిశాఖ అధికారులు చివరి భూములకు నీరు అందించాలనే ఉద్దేశంతో పూర్తి సామర్థ్యంతో నీటిని విడుదల చేశామంటున్నారని ఏవో తెలిపారు. అయితే నీటి పారుదల శాఖ అధికారులతో నీటి సామర్థ్యం తగ్గించే విధంగా చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

తెనాలిని జిల్లా కేంద్రంగా ఎంపిక చేయాలి

రేపల్లె, వేమూరులను తెనాలి జిల్లాలో కలపాలి



రేపల్లె: రాష్ట్రంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణ జరిగినప్పుడు గతంలో రేపల్లె, వేమూరు నియోజకవర్గాలను బాపట్ల జిల్లాలో విలీనం చేశారని పట్టణ అభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహన్‌రావు అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రాలైన రేపల్లె, వేమూరు నుంచి బాపట్లకు నేరుగా రైలు సౌకర్యం లేదన్నారు. రేపల్లె నుంచి బాపట్లకు బస్ సౌకర్యం సైతం అంతంత మాత్రమే నన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం జిల్లాల పునరాశి కర్ణ చేస్తున్న నేపథ్యంలో రేపల్లె, వేమూరు నియోజకవర్గాలను తెనాలిలో కలపాలని ఆయన కోరారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాలలో పూర్తిస్థాయి రైలు, రోడ్డు రవాణా సౌకర్యాలు కలిగి ఉన్నాయని.. తెనాలి–వేమూరు–రేపల్లెకు రైలు సౌకర్యం పూర్తిస్థాయిలో ఉందని ఆయన తెలిపారు. జిల్లాలు, మండలాల పేర్లు, సరిహద్దుల మార్పు కోసం ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘ సభ్యులు అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, వి.అనిత, జనార్ధన్ రెడ్డి, రామానాయుడు, మనోహర్, సత్యకుమారులు ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకుని అన్ని వసతులు ఉన్న తెనాలిని జిల్లా కేంద్రంగా ఎంపిక చేసి తెనాలి జిల్లాలో రేపల్లె, వేమూరు నియోజకవర్గాలను కలపాలని ఆయన కోరారు.

ఆర్గానిక్ కూరగాయలతో ఆరోగ్యం



కూరగాయలు కొనుగోలు చేస్తున్న శ్రీనివాసరావు

తెనాలి టౌన్: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు వినియోగించడం వల్ల ఆరోగ్యం చేకూరుతోందని మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆర్గానిక్ కూరగాయల అమ్మకాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి సోమవారం మండల పరిషత్, కలెక్టరేట్ కార్యాలయాల్లో ఆర్గానిక్ పంటలకు సంబంధించిన ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పండించిన పంటలనే విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. కూరగాయలు వినియోగించడం వల్ల మంచి పోషకాహారం, ఆరోగ్యం చేకూరుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఏటీఎం మోడల్, ఏగ్రేడ్ మోడల్ ద్వారా వచ్చిన కూరగాయలు ఇక్కడ స్టాల్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎరుకులపూడి యూనిట్ ఇన్‌చార్జి టి.విజయలక్ష్మి, తెనాలి డివిజన్ మాస్టర్ ట్రయినర్ ఆర్.శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీ కె.ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌సీ క్లస్టర్స్ అథ్లెటిక్స్‌లో విజయం



విద్యార్థిని అశ్లేషారాను అభినందిస్తున్న డైరెక్టర్ యానీ అరుణలత

తెనాలి టౌన్: ఆంధ్రా, తెలంగాణ సీబీఎస్‌సీ క్లస్టర్స్, అథ్లెటిక్స్ నందు సెయింట్‌జాన్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థిని ఎం.అశ్లేషారా ఘన విజయం సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సూరజ్‌మోహన్, డైరెక్టర్ యానీ అరుణలత పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో డాక్టర్ సూరజ్‌మోహన్ మాట్లాడారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో నెల్లూరులో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–14 బాలికల హైజంప్ విభాగంలో తమ విద్యార్థిని అశ్లేషారా ప్రథమ బహుమతి సాధించి గోల్డ్ మెడల్ కై వసం చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థుల ప్రగతికి విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కళలను ప్రోత్సాహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో చోరీ

దావులూరిపాలెం (కొల్లిపర): మండల పరిధిలోని దావులూరిపాలెం ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. దీనిపై ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దావులూరి పాలెంలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో దొంగలు హుండీలోని సుమారు రూ.20 వేలు చోరీ చేసినట్లు తెలిపారు. రోజూ లానే తెల్లవారు జామున పండితులు ఆలయం వద్దకు వచ్చారు. ఆలయంలోని ప్రధాన గుడి తలుపులు తెరిచి ఉండడంతో పాటు హుండీ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దీంతో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎస్ఐ కోటేశ్వరరావుకు సమాచారం అందించారు. ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కమిటీ సభ్యులు అందించిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.